

# కపర్ది

సస్పెన్స్ థ్రిల్లర్ నవల

రచన

కొల్హాపూర్ రామమూర్తి



# మంచి రచన

భవభూతి 8వ శతాబ్దానికి చెందిన గొప్ప సంస్కృత పండితుడు. ప్రతిభావంతుడైన నాటక రచయిత. ఆయన ఉత్తరరామచరిత్ర అనే సంస్కృతనాటకం రచించాడు. అది రాముడి పట్టాభిషేకం తరవాత జరిగిన కథ, కల్పన.

ఆ నాటకానికి ప్రారంభంలో దర్శకుడు (సూత్రధారి) ప్రేక్షకులతో ఇలా చెప్పాడు. "ఏషోస్మి కార్యవశాత్ అయోధ్యకః తదానీంతనశ్చ సంవృత్తః" – "ఇప్పుడు నేను రాముడి కాలంలోకి వెళ్ళిపోతున్నాను. ఆ కాలంలో అయోధ్యలో నివసిస్తున్నాను". అంటే, రచయిత మనందరినీ మానసికంగా అయోధ్యకి తీసుకువెళ్ళాలి. మనం రాముడి పరిపాలనాకాలంలోకి వెళ్ళిపోవాలి. ఆ నాటకంలో పాత్రల సమకాలీనులమై నాటకాన్ని చూడాలి. ఇది రచయితలకు భవభూతి ఇచ్చిన సందేశం.

ఏ రచయిత అయినా సరే, పాఠకుణ్ణి తాను సృష్టించిన సన్నివేశాలలోకి మానసికంగా తీసుకువెళ్ళగలగడమే అతడి నేర్పుకి కొలమానం. ఫైవ్ స్టార్ హోటల్ గురించి చదువుతుంటే పాఠకుడికి ఆ హోటల్ లో ఉన్న అనుభవం కలగాలి. కేదారేశ్వర ఆలయం గురించి వ్రాసినా అంతే. అలా తీసుకువెళ్ళగలిగితేనే ఆ రచన పాఠకులని ఆకట్టుకుంటుంది. ప్రజలలో కొంతకాలం నిలుస్తుంది.

కపర్ది నవలని ఆ విధంగా రచించడంలో శ్రీ కొల్హాపూర్ రామమూర్తి సఫలమయ్యారు.

ఎన్ని సన్నివేశాలు చూపించారు!

రెండు ఆశ్రమాలు. రెండూ మంచివే. కానీ పోటీ! ఒక రహస్యం కాపాడాలనే నిబద్ధత ఒకరిది. ఆ రహస్యాన్ని అవతలివారు ఎందుకు కాపాడుతున్నారో తెలియక దాన్ని స్వంతం చేసుకోవాలనే పంతం మరొకరిది.

రూల్స్ ప్రకారం మాత్రమే పనిచేసే సి.బి.ఐ. కార్యాలయం ఒకటి. విశృంఖలంగా, విధ్వంసమే లక్ష్యంగా ఏ నియమాలూ లేని పైశాచిక ప్రవృత్తిలో ఉన్న ఐ.ఎస్.ఐ. కార్యాలయం మరొకటి.

ఒక పక్క ఔపనిషద మంత్రాలూ, మరొకపక్క సూఫీ సూక్తులూ. హిందూ స్వాముల ఆశ్రమంలో ముస్లిం భక్తుడు. ఆ భక్తుడు ఉపనిషద్ వాక్యాలకు భాష్యంమీద చర్చించడం, సందేహాలు తీర్చుకోవడం!

మానవీయ దృక్పథంలో ఉన్న, అనుభవంలేని సిబిఐ ఆఫీసర్, ఆమె లక్ష్యం కరుడుగట్టిన భయంకరుడైన ఉగ్రవాది! పాకిస్తాన్ గూఢచర్యం, భారత్ కి వ్యతిరేకంగా రహస్యంగా కుట్రలు. ఇంగ్లాండూ, భారతదేశం సంయుక్తంగా చేసిన ప్రతిగూఢచర్యం. కార్యసాధనలో వ్యక్తి నిబద్ధతకీ, వ్యవస్థ బలానికీ మధ్య ఉన్న తేడా. వీటన్నిటి మధ్యా సాంప్రదాయికమైన పేర్లూ, సంఘటనలూ పడుగూపేకాలా అల్లుకుపోవడం.

మరొక పక్క బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని అనుసరించి భూగోళం ఏర్పడడం, ఘనీభవిస్తున్న లావానుంచి రాడాన్ వాయువు ఉత్పత్తి. అది ఘనీభవించి, సాంద్రమైన శివలింగాకారంలో ఏర్పడడం, అది భూమి ధృవాక్షపరంగా చేసే ఆత్మభ్రమణానికి అవసరమైన జడత్వభ్రామకాన్ని కలిగించడంలో తోడ్పడడం – ఈ భాగం విజయవంతంగా, అంటే నిజమేనేమో అనిపించేలా, భక్తిప్రపంచంలో ఇమిడ్చిన సైంటిఫిక్ ఫిక్షన్.

అనేక విషయాలను లోతుగా ఆధ్యయనం చేసి, పూర్తి అవగాహన ఏర్పరుచుకుంటే తప్ప ఇన్ని విభిన్నమైన పూర్వరంగాలని సృష్టించి, వాటిమధ్యలో కథని ఆసక్తి తగ్గకుండా ఆసాంతం కూర్చడం సాధ్యంకాదు. ఆ పైన రచన నాలుగు పేజీలు మనం చదివితే, మిగిలిన పేజీలు మనచేత అదే చదివించేలా చేయడానికి భగవంతుడు ఇచ్చిన ప్రజ్ఞ ఉండాలి. దీనినే ప్రతిభ అంటారు.ఇది కేవలం గ్రంథాలు చదివినంత మాత్రాన రాదు.

కపర్దం అంటే శివుడి జటాజూటం. సీరియల్ కి 'కపర్ది' అనే పేరు చూసి నేను కుతూహలంతో ఆంధ్రభూమి వారపత్రికలో ఒక ఎపిసోడ్ చదివాను, ఆనందించాను. అక్కడినుండి

సీరియల్ పూర్తి అయేవరకూ ప్రతీ ఎపిసోడూ చదివాను. ఇది రచయిత మొదటి రచన అని తెలిసి ఆశ్చర్యపోయాను. ఇంత బిగువైన, చక్కని రచన చేసిన రామ్మూర్తి గారిని అభినందిస్తూ, ఆయన ఇంకా మరిన్ని మంచి రచనలు చెయ్యాలని ఆంకాక్షిస్తున్నాను.

16-11-2016 ఉప్పులూరి కామేశ్వరరావు

హైదరాబాదు.

ॐ

# కపర్ది

## ప్రొలోగ్

జూన్ 13, 2011

డెహ్రాడూన్

జన్ లోక్ పాల్ బిల్ కోసం అన్నాహజారే చేస్తున్న ఉద్యమాన్ని దేశమంతా ఆసక్తిగా గమనిస్తోంది. పాలనా వ్యవస్థలో అవినీతి పాతుకునిపోయి, జుగుప్స పుట్టించే స్థాయికి ఎదిగిపోయిన సమయంలో, ఎక్కడో ఒక చిన్న ఆశాకిరణం, అన్నాహజారే ఉద్యమం రూపంలో సగటు భారతీయుడికి కనిపిస్తోంది. ఆయనకు పోటీగా నిరాహారదీక్షలు చేయడానికి కొందరు 'స్థితప్రజ్ఞులు' కూడా ప్రయత్నించి, ఆకలి భరించలేక మధ్యలోనే విరమిస్తున్న ఆ సమయంలో...

డెహ్రాడూన్ లోని జాలీగ్రాంట్ హాస్పిటల్ లో నిర్వేదంతో కూడిన నిశ్శబ్దం అలుముకుంది. గంగానదిని ఇల్లీగల్ మైనింగ్ మాఫియా నుండి కాపాడేందుకు, దాదాపు నాలుగు నెలలుగా నిరాహారదీక్షలో ఉన్న స్వామీ విమలానంద ఆరోజు మధ్యాహ్నం రెండున్నరకి చనిపోయినట్టు హాస్పిటల్ ప్రకటించింది. అప్పుడు అతడి వయసు ముప్పైఐదు సంవత్సరాలు. బీహార్ లోని దర్భంగా (దర్భగంగా) లో పుట్టి, పంతొమ్మిది సంవత్సరాల వయసులో సత్యాన్వేషణ కోసం ఎవరికీ చెప్పకుండా యిల్లు వదిలివెళ్ళాడు. పర్యావరణాన్ని రక్షించే ఉద్దేశ్యంతో తనలాగే ఆలోచించే కొంతమంది యువకులతో కలిసి 1997లో ధాత్రిసదన్ సంస్థను స్థాపించాడు. వారి ఉద్యమం గాంధీమార్గంలో కొనసాగింది. గంగానదీ

తీరంలో అక్రమంగా క్వారీలు నడుపుతున్న ఇసుక, రాళ్ళ మాఫియాలకు వ్యతిరేకంగా 1998లో, తిరిగి 2008లో విమలానంద నిరాహారదీక్ష చేపట్టాడు.

తిరిగి ఫిబ్రవరి 2011లో ప్రారంభించిన అతడి నిరాహారదీక్ష రెండుసెలలు కొనసాగింది. ఏప్రిల్ 2011లో బలవంతంగా అతడిని డెహ్రాడూన్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ కు తరలించారు. మూడురోజుల తర్వాత ఓ నర్స్ (ఆమె ఎవరో యిప్పటికీ ఎవరికీ తెలియదు) అతడికి ఏదో ఇంజెక్షన్ చేయడంతో కోమాలోకి వెళ్లాడు. అతడి మీద విషప్రయోగం జరిగిందని ధాత్రిసదన్ సభ్యులు గొడవచేయడంతో జాలీగ్రాంట్ హాస్పిటల్ కి తరలించారు. సీరంటెస్ట్ లో అతడి రక్తంలో ఆర్గనో ఫాస్ఫేట్స్ ఉన్నట్టు వెల్లడైంది. ఎన్నో ఆంటిడోట్స్ యిచ్చినప్పటికీ విమలానందను డాక్టర్స్ కాపాడలేకపోయారు. చివరికి జున్ 13 న అతడు మరణించాడు.

ధాత్రిసదన్ సభ్యులకు తప్ప, అతడి మరణం దేశంలో ఎవరికీ పెద్దగా విషాదం కలిగించలేదు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూపించే మీడియా కూడా, ఈ హత్యకు పెద్దగా కవరేజ్ యివ్వలేదు. ఐ.పి.ఎల్. స్కాంనో, స్టింగ్ ఆపరేషన్స్ లో హిడన్ కెమెరా ముందు నోట్లకట్టలు తీసుకునే అధికారినో, ఎన్నికల్లో గెలిచినరోజు, బార్ డాన్సర్లతో గంతులేసే రాజకీయనాయకులనో చూపిస్తే వచ్చే టి.ఆర్.పి.రేటింగ్ తో పోలిస్తే, పర్యావరణం కోసం పోరాడి చనిపోయిన ఓ 'అనామకుడి' రేటింగ్ చాలాతక్కువే మరి! సత్యాగ్రహం చేసేవారిని యిలా సులభంగా ఎలిమినేట్ చేసే మైనింగ్ మాఫియా టెక్నిక్స్ బ్రిటిష్ వారికి కూడ తెలిసుంటే, బహుశా ఇప్పటికీ మనదేశాన్ని పరిపాలిస్తూ ఉండేవారు!

మైనింగ్ మాఫియాలు దేశరాజకీయాల్ని శాసించే శకంలో, విమలానందలాంటి వారు చేసే నిరాహారదీక్షలని పట్టించుకోవడానిక్కూడా ఎవరికీ తీరికలేదు. ఇంట్లోని చెత్తంతా ప్లాస్టిక్ కవర్లలో నింపి, నిర్మొహమాటంగా వీధిచివర్లో, లేదా డ్రైనేజి కాల్వల్లోకి విసిరేసి, తమ యింట్లోని విట్రిఫైడ్ టైల్ ఫ్లోరింగ్ మెరుస్తుండడమే శుభ్రత అని భావించేవారికీ, గుట్కా, పాన్ మసాలాలు తిని, నిలుచున్న చోటే ఉమ్మేస్తూ స్వతంత్రానికి అర్థం అదేనని వెటకారంగా మాట్లాడేవారికీ, యు.వి.టార్చ్ లైట్ వెలుగులో చిన్నపిల్లల చేతులమీద, దంతాలమీద బాక్టీరియాని చూపించగల డాక్టర్లకూ, వారి మాటల్ని నోళ్ళు వెళ్లబెట్టుకుని విసే "కిటాణు కాన్షస్" తల్లులకూ, పర్యావరణం గురించి చెప్పినా విసే తీరికలేదు.

మరుసటిరోజు విమలానంద అంత్యక్రియలు జరిగాయి. ధాత్రిసదన్ సభ్యులతో పాటు, హరిద్వార్ లోని వాతాపిగణపతి ఆశ్రమం పీఠాధిపతి విద్యారణ్యసరస్వతి, ఆయన శిష్యులు కొంతమంది అంత్యక్రియలకు హాజరయ్యారు. తన పూర్వాశ్రమం (సన్యాసం తీసుకోవడానికి ముందు) భార్య మరణించినప్పుడు కూడా కన్నీరుపెట్టని ఆయన మొదటిసారి కన్నీరుపెట్టడం చూసి అందరూ చలించిపోయారు.

ఎప్పుడూ ఆయనతోనే ఉండే ఆశ్రమం సేవకుడు, కపర్ది కూడా మౌనంగా తన స్నేహితుడి అంత్యక్రియల్లో లీనమయ్యాడు. కపర్ది వయసు ఇరవైఏడు సంవత్సరాలు. తొమ్మిదిసంవత్సరాల వయసులో, ఓ అనాథగా వాతాపిగణపతి ఆశ్రమానికి వచ్చాడు. విమలానందతో అతడి పరిచయం, పదిసంవత్సరాల క్రితం జరిగింది. పర్యావరణం విషయంలో ఇద్దరి ఆలోచనాధోరణులు కలవడంతో మంచి స్నేహితులయ్యారు.

అంత్యక్రియల తర్వాత, విద్యారణ్య సరస్వతి అందరినీ ఉద్దేశించి చెప్పారు, “ఈరోజు మన దేశచరిత్రలో ఓ అత్యంత బాధాకరమైన దినం. ఈ ఆధునికయుగంలో, మనిషి సుఖాల వ్యామోహంలో పడి, తెలిసోతెలియకో పర్యావరణానికి చాలా హానిచేస్తున్నాడు. కానీ, తన తప్పును ఎత్తి చూపించేందుకు, సరిచేసేందుకు శాంతిమార్గంలో ఉద్యమించే విమలానందలాంటి మంచివ్యక్తుల్ని కూడా భూమ్మీద లేకుండా చేసి, తన నాశనాన్ని తానే ఆహ్వానిస్తున్నాడు. అయినా సరే, మీరెవ్వరూ ఆవేశాలకు పోకుండా, విమలానంద మొదలుపెట్టిన ఈ సత్యాగ్రహాన్ని కొనసాగించండి.

సనాతనంగా మనదేశంలో పాటిస్తున్న పూజావిధానాలు, మంత్రతంత్రాలన్నీ పర్యావరణాన్ని, మన ఆరోగ్యాన్ని కాపాడే ఉద్దేశ్యంతో చేసినవేనని మా గురువుగారు చెబుతుండేవారు. కానీ, నేడు వాటన్నిటినీ మూఢనమ్మకాలని కొట్టిపారేయడంవల్ల, మనిషి ప్రకృతిలో తానూ ఒక భాగమనే విషయాన్నే మరచిపోయాడు. నేల, నదులు, అడవులు, జంతువులు, పక్షులు, ఇంకా ఇతర జీవరాశి, యివన్నీ కేవలం తన సుఖంకోసమే ఈ సృష్టిలో ఉన్నాయనే భ్రమలోపడి, అన్నిటినీ దుర్వినియోగం చేస్తున్నాడు.

మీరంతా శాంతిమార్గంలో ఈ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లండి. మేధావివర్గంలోనూ చాలామంది మన అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నారు. వారిని కలుపుకుని ముందుకు సాగుదాం. నదీతీరాలు, బేసిన్ ల నుండి భారీగా ఇసుక, రాళ్ళు అక్రమంగా తరలించడంవల్ల, పచ్చని పంటపొలాలు బీడు భూములుగా ఎలా మారుతున్నాయో ప్రచారంచేద్దాం. టూరిజం డెవలప్మెంట్ పేరుతో విచక్షణారహితంగా ఉత్తరాఖండ్ లో చెట్లు నరికేస్తున్నారు. అందుకు వ్యతిరేకంగా మనం మరిన్ని చెట్లను నాటి, మన సత్యాగ్రహ ఉద్యమాన్ని కొనసాగిద్దాం"

ఆయన ప్రసంగం తర్వాత గణపతి ఆశ్రమం సేవకులు, ప్రతిరోజు కార్యక్రమాల తర్వాత చేసే తమ ప్రార్థన శ్లోకాన్ని ఆలపించారు.

కామధేనువుదరిని నాట్యమాడే హరుని పదపీఠాన శిరసుంచి మ్రొక్కరా
స్థిరముగా సత్యమెప్పుడు నిబిడమైయుండు త్యాగాల పదతలాన శోధించరా

ఈ శ్లోకం విద్యారణ్యసరస్వతికి ముందున్న గురువు, శివానందసరస్వతి తన చివరిరోజుల్లో రాసింది. ఆశ్రమంలో ఎవరికీ దాని అర్థం సరిగా తెలియకపోయినా, ఆయన చివరి కోరికగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం కార్యక్రమాల ముగింపుగా దాన్ని ఆలపించడం ఆనవాయితీగా మారింది.

అందరూ ప్రార్థనలో లీనమైన ఆ సమయంలో, కపర్ది మాత్రం మౌనంగా ఉన్నాడు. ఎన్నోసార్లు తన స్నేహితుడికి చెప్పాడు ... శాంతి మార్గం ఈ రోజుల్లో పనిచేయదని. ఖనిజాలకోసం కొండల్ని కూడా త్రవ్వేసి, లోయలుగా మార్చగల మైనింగ్ మాఫియాలకి అడ్డదారుల్లో, చాలా త్వరత్వరగా పర్మిట్స్ యిచ్చేసి, జరగకూడని నష్టం అంతా జరిగిపోయాక, 'పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిమీదా ఎంతైనా ఉందంటూ' ప్రజలకి గంభీరమైన ఉపన్యాసాలిచ్చే 'లీడర్స్' రాజ్యమేలుతున్నపుడు, శాంతిమార్గం, సత్యాగ్రహం పనిచేయవు. కానీ విమలానంద తన మాట వినలేదు, ఫలితం ... దయనీయమైన అతడి మరణం... కాదు... హత్య!

కపర్దికి మనసంతా నిర్వేదంగా ఉంది. ఎవరో ఒకరు పూనుకుని ఈ వినాశనాన్ని ఆపాలి. బహుశా, శివానందసరస్వతి గురూజీ చెప్పిన మహావిపత్తుకు సమయం కూడా దగ్గరపడుతోంది!

*** *** *** ***

# ప్రారంభం

సెప్టెంబర్,14, 2012

జిన్నా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, కరాచీ

దుబాయ్ నుండి వచ్చిన ఎమిరేట్స్ ఫ్లైట్ ఇ-608, తన షెడ్యూల్ టైం ప్రకారం, సాయంత్రం 06.05 కు లాండ్ అయింది. ఇమిగ్రేషన్ ఫార్మాలిటీస్ ముగించుకుని అరగంటలో బయటికి వచ్చాడు హమీద్ మిర్. అతడి వయసు 60సంవత్సరాలు. కాబుల్ లోని పాకిస్తాన్ రాయబార కార్యాలయంలో వీసా సెక్షన్ మేనేజర్ గా పనిచేసి, రెండురోజుల క్రితం రిటైర్ అయ్యాడు. ఉదయం ఎనిమిదికి కాబుల్ నుండి మొదలైన అతడి ప్రయాణం, దుబాయ్ మీదుగా కరాచీ చేరడంతో పూర్తయింది. దాదాపు ఇరవై సంవత్సరాలు ఆఫ్ఘనిస్తాన్ లో పనిచేసి రిటైర్ అవుతుండడంతో, ఎంబసీలోని స్టాఫ్ ఘనంగా పార్టీ యివ్వాలని ప్లాన్ చేశారు. కాని హమీద్ మిర్ చాలా రిజర్వ్డ్ కావడంవల్ల, ఎప్పుడూ పార్టీలకు దూరం. సింపుల్ గా వీడ్కోలు ముగించుకుని బయలుదేరాడు.

హమీద్ మిర్ పార్టీలకు దూరంగా ఉండడానికి యింకో ముఖ్యమైన కారణం... అతడి నిజమైన ఐడెంటిటీ! అందరికీ వీసా సెక్షన్ మేనేజర్ గా మాత్రమే తెలిసిన హమీద్ మిర్, నిజానికి ఐ.ఎస్.ఐ. కి చెందిన జాయింట్ ఇంటలిజెన్స్ మిసిలేనియస్ (జే.ఐ.ఎమ్.) లో సీనియర్ ఏజంట్. యుద్ధ సమయాల్లో, కోవర్ట్ ఆపరేషన్స్ లో పనిచేసే జే.ఐ.ఎమ్., అతి రహస్యమైన సంస్థ. ఐ.ఎస్.ఐ. లోని మిగతా విభాగాల్లో చాలా సంవత్సరాలు సిన్సియర్ గా

సర్వీస్ చేసి డి.డి.జి.(ఎక్స్టర్నల్) దృష్టిలో పడిన వారికి మాత్రమే జే.ఐ.ఎమ్. లో పనిచేసే అవకాశం దొరుకుతుంది.

అతడికి పద్దెనిమిది సంవత్సరాల వయసులో నిఖా అయింది. అప్పట్లో ఈస్ట్ పాకిస్తాన్(బాంగ్లాదేశ్)కి వెళ్లి చదువుకుంటున్న వయసులోనే, ఓ బాంగ్లాదేశీ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. సంవత్సరం తిరిగేలోగా కొడుకు పుట్టడంతో బాధ్యతలు పెరిగాయి, పాక్ ఆర్మీలో చేరాడు. అంతలోనే బాంగ్లాదేశ్ లో తిరుగుబాటు, ఇండియాతో యుద్ధం మొదలయ్యాయి. అప్పటి అల్లర్లలో అతడి భార్య చనిపోయింది. అతడి తల్లి తిరిగి పాకిస్తాన్ వచ్చేయమని ఒత్తిడి చేయడంతో, కొడుకును భార్య బంధువులకి అప్పగించి, తాను కరాచీ వచ్చేశాడు. ఇక అప్పటినుండి ఇండియా అంటే ఆపుకోలేని కసి పెంచుకున్నాడు. కష్టపడి పనిచేసి, ఆర్మీ నుండి ఐ.ఎస్.ఐ. కి మారాడు.

సోవియట్ యూనియన్, 1989లో ఆఫ్ఘనిస్తాన్ నుండి తన సైన్యాన్ని వెనక్కి పిలిపించడంతో ఆఫ్ఘనిస్తాన్-పాకిస్తాన్ బార్డర్స్ (ఆఫ్-పాక్) లో తీవ్రమైన ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో నజీబుల్లా పాలన నుండి ఆఫ్ఘనిస్తాన్ కు విముక్తి కల్పించడానికి ఎన్నో తీవ్రవాద వర్గాలు ఏర్పడ్డాయి. ఒక్కో వర్గాన్ని ఒక్కో దేశం సపోర్ట్ చేసేది. గుల్బుద్దీన్ హెక్మతియార్ నేతృత్వంలోని హిజబ్-ఇ-ఇస్లామీని పాకిస్తాన్ సపోర్ట్ చేస్తే, ఇరాన్, షియా-హిజబ్-ఇ-వాదత్ ని, సౌదీ అరేబియా, ఇత్తిహాద్-ఇ-ఇస్లామీ ని సపోర్ట్ చేసేవి. అమెరికా మాత్రం తెరవెనకనుండి పాకిస్తాన్ కి, సౌదీ అరేబియాకి ఆర్థికంగా సహాయం చేసేది. మధ్యఆసియాలో పట్టుకోసం అన్నివర్గాలూ అలా తమ శక్తికొద్దీ ప్రయత్నిస్తున్న ఆ సమయంలో, పాకిస్తాన్ కి తన బెస్ట్ ఏజంట్స్ ని ఆఫ్-పాక్ లోనికి పంపించాల్సిన అవసరం ఏర్పడింది.

హమీద్ మిర్ అప్పటివరకు ఐ.ఎస్.ఐ. లోని జాయింట్ కౌంటర్ ఇంటలిజెన్స్ బ్యూరోలో (జె.సి.ఐ.బి.) పనిచేసేవాడు. అప్పట్లో అతడి ఏరియా ఆఫ్ స్పెషలైజేషన్ ఇండియా. హిందీ, ఇంగ్లీష్ తో పాటు ఐదు భారతీయ భాషల్లో మాట్లాడగలడు, రాయగలడు. 1990లలో భారతదేశంలో మతఘర్షణలు, హింసాకాండ తీవ్రరూపం దాలుస్తున్నపుడు, హమీద్ మిర్ ఓ ముఖ్యమైన ఆపరేషన్ లో చాలా ఆక్టివ్ గా ఉన్నాడు. కానీ ఇండియాకంటే అప్పట్లో పాక్ కు ఆఫ్ఘనిస్తాన్ చాలా ముఖ్యం కావడంతో, 1993లో అతడిని సడన్ గా వెనక్కి పిలిపించారు.

మొదట్లో హమీద్ మిర్ చాలా డిసపాయింట్ అయ్యాడు. కానీ, అతడి బాస్ ముక్తార్ అహ్మద్ తో మాట్లాడాక కన్విన్స్ అయ్యాడు. ఈ విషయంలో ముక్తార్ అహ్మద్ చాలా ఎఫిసియంట్. ఎటువంటి ఏజెంట్ నైనా మాటల్తో కన్విన్స్ చేసి, తనకి కావలసిన రీతిలో పనిచేయించుకోవడం ముక్తార్ అహ్మద్ స్పెషాలిటీ. దేశ రాజకీయ ప్రయోజనాలు అన్నిటికన్నా ముఖ్యమైనవి, వ్యక్తుల ఇష్టాయిష్టాలకు ఎటువంటి ఇంపార్టెన్స్ లేదని హమీద్ మిర్ కి అర్ధమైంది.

మొదట ఆఫ్-పాక్ బార్డర్స్ లో తాలిబాన్ తో పనిచేసి, క్రమంగా కాబుల్ చేరుకున్నాడు. ఇరాన్ ను ఆఫ్ఘనిస్తాన్ నుండి దూరంగా ఉంచేందుకు ఎంతోమంది షియా-హిజబ్-ఇ-వాదత్ తీవ్రవాదుల్ని చంపించాడు. ఎన్నో చీకటి ఒప్పందాలు, బాంబింగ్స్, ఊచకోతల్లో హమీద్ మిర్ హస్తం ఉంది. 1996-97 సమయంలో ఆఫ్ఘనిస్తాన్ ను ఎవరు పరిపాలిస్తున్నారో తెలియని పరిస్థితి ఉండింది. ఆ సమయంలో తాలిబాన్ ను గైడ్ చేసి, 1998 లో అహ్మద్ షా మసూద్ కంట్రోల్ నుండి మజార్-ఇ-షరీఫ్ ని విడిపించడంలో హమీద్ పాత్ర చాలా ఉంది. అప్పుడు తాలిబాన్ జరిపిన ఊచకోతలో వేలమంది చనిపోయారు. అందులో ఎంతోమంది ఇరాన్ డిప్లొమాట్స్ కూడా ఉన్నారు. వారి శవాల్ని తాలిబాన్ నుండి విడిపించుకోవడానికి, ఇరాన్ ఏకంగా రెండు లక్షలమంది సైన్యాన్ని ఆఫ్ఘన్ బార్డర్స్ లో మొహరించాల్సివచ్చింది.

మజార్-ఇ-షరీఫ్ ను విడిపించిన తర్వాత, పాక్ ఇంటలిజెన్స్ వర్గాల్లో హమీద్ ఓ హీరో అయ్యాడు. ఏదైనా విషయంలో హమీద్ ఇన్వాల్వ్ అయ్యాడంటే సక్సెస్ గ్యారెంటీ. అతడి పాలసీ ఒక్కటే ... ఏ పనిలో అయినా హింస, రక్తపాతం, పాకిస్తాన్ లో జరగడానికి వీల్లేదు. తమదేశం ప్రజలు డిస్టర్బ్ అవకూడదు. అతడి దృష్టిలో సక్సెస్ ఆఫ్ ఇంటలిజెన్స్ అంటే అదే. అందుకే అతడు ప్లాన్ చేసే ప్రతి ఆక్టివిటీ, పాకిస్తాన్ బయటే జరిగేది. ఈ కారణంగానే ఆల్ కైదా అంటే కూడా అతడికి ద్వేషం. పవిత్రమైన పాకిస్తాన్ లో, ఆల్ కైదా తన పట్టుకోసం ఎంతోమందిని చంపించింది. పాక్ రాజకీయ నాయకులు, సైన్యంలో అధికారదాహం ఎక్కువైన వ్యక్తులు, ఒసామా బిన్ లాడన్ సపోర్ట్ కోసం ప్రాకులాడడం, తమ ప్రత్యర్ధుల్ని ఆల్ కైదా ద్వారా

చంపించడం, ఇవన్నీ అతడికి చాలా ఏవగింపు కలిగించేవి. ఇలాగే కొనసాగితే, పాకిస్తాన్ పూర్తిగా ఆల్ కైదా కంట్రోల్ లోకి వెళ్ళిపోతుందని కొలీగ్స్ తో అనేవాడు. చివరికి అదే జరిగింది.

పికప్ టాక్సీ డ్రైవర్స్ పట్టుకున్నప్లకార్డ్స్ చూస్తూ లీగసీ హోమ్స్ ప్లకార్డ్ వైపు వెళ్లాడు. డ్రైవర్ కి సైగ చేయడంతో అతనొచ్చి హమీద్ మిర్ చేతిలోని లగేజ్ అందుకున్నాడు. కరాచీలోని ఫైవ్ స్టార్ హోటల్స్ కన్నా లీగసీ హోమ్స్ అతడికి బాగానచ్చింది. అది కరాచీ ఎఫ్.బి. ఏరియా, సెకెండ్ బ్లాక్ లోని ఓ లగ్జరీ అపార్ట్ మెంట్స్ సముదాయం. కానీ, ఏర్పాట్లు ఫైవ్ స్టార్ హోటల్స్ కంటే బాగుంటాయి. అన్నిటికంటే ముఖ్యంగా అతడికి నచ్చింది, కావలసింది - ప్రైవసీ. లీగసీ హోమ్స్ లోని మూడు అపార్ట్ మెంట్స్ పర్మనెంట్ గా జే.ఐ.ఎమ్. కి కేటాయించబడ్డాయి. అవసరమైనప్పుడు జే.ఐ.ఎమ్. లోని సీనియర్స్ కి మాత్రమే అందులో ఉండే అవకాశం ఉంటుంది.

"ఎంత టైం పడుతుంది?" అడిగాడు హమీద్ మిర్ టాక్సీ ఎయిర్ పోర్ట్ బయటికి రాగానే.

"ట్రాఫిక్ హెవీగా ఉంది సర్, గంట పైనే పడుతుంది" చెప్పాడు డ్రైవర్.

"ఓకే, తారిక్ రోడ్ మీదుగా వెళ్ళు. డోల్ మెన్ మాల్ దగ్గర ఆపు, పనుంది"

"జీ హుజూర్"

డోల్ మెన్ మాల్ కరాచీలోని చాలా పెద్ద మాల్స్ లో అది ఒకటి. అందులోని ఫుడ్ కోర్ట్ లో దొరికే తఫ్తాన్స్ అంటే హమీద్ మిర్ కి చాలా యిష్టం. చేసే పద్ధతి నాన్ లాగే, కాకపోతే పెనంమీద నాన్ వేశాక, కోడి గుడ్డు లోని తెల్ల సొనని నాన్ మీద వేసి, నువ్వులు స్మియర్ చేస్తారు. నాన్ సరిగా కాలాక వెన్న పూసి పాక్ చేస్తారు. ఒంటరిగా, రిలాక్స్ గా ఉన్నపుడు డిస్కవరీ ఛానల్ చూస్తూ, తఫ్తాన్స్ తినడం అతడికి చాలా యిష్టం.

అలా రిలాక్స్ గా ఉన్నపుడు అతడికి యిష్టమైంది ఇంకోటుంది ... అది స్కాచ్ తాగడం, అదికూడా జానీ వాకర్ బ్లూలేబిల్. కానీ, యిప్పట్లో ఆ కోరిక నెరవేరేలా లేదు.

పాకిస్తాన్ లో లిక్కర్ అమ్మకం మీద చాలా రిస్ట్రిక్షన్స్ ఉన్నాయి. ఈమధ్యకాలంలో ఎయిర్ పోర్ట్స్ లో చాలా పెద్ద మొత్తంలో స్మగుల్డ్ లిక్కర్ దొరకడంతో, డిపార్ట్మెంట్ అలర్టయింది. గవర్న్మెంట్ పర్మిషన్ తో నడిచే పర్మిట్ రూంస్ లో హిందువులు, క్రిస్టియన్లకోసం దేశీ లిక్కర్ తక్కువ మొత్తంలో అమ్ముతారు. బ్రిటిష్ పాలనకు చిహ్నంగా మిగిలిన ముర్రీ బ్రీవరీస్ లో తయారైన లిక్కర్, పర్మిట్ రూంస్ లో దొరుకుతుంది. కానీ అతడికి నచ్చిన స్కాచ్ అక్కడ దొరకదు. అదే ఇస్లామాబాద్ లో అయితే స్కాచ్ చాలా సులభంగా దొరుకుతుంది. ఆఫ్రికన్ దేశాల ఎంబసీల్లో విరివిగా విదేశీ డ్రింక్స్ దొరుకుతాయి... కొంచెం కాస్ట్లీ అంతే.

డోల్ మెన్ మాల్ మీదుగా టాక్సీ లీగసీ హోమ్స్ చేరుకునే సరికి రాత్రి ఎనిమిదైంది. రిసెప్షనిస్ట్ రూం కీస్ తో పాటు ఓ చిన్న ఎన్వలప్ యిచ్చాడు. ఓపన్ చేసి, అందులోని స్లిప్ తీసి చదివాడు.

‘916, జిన్నా 19 ఏ.ఎం.’

అతడికి అర్థమైంది. పాక్ ఇంటలిజెన్స్ భాషలో ఏ.ఎం. అంటే ‘అహ్మద్ ముక్తార్’. 9-16 అంటే సెప్టెంబర్ పదహారో తేదీ, సాయంత్రం ఏడు గంటలకి తనని కలవమని ముక్తార్ అహ్మద్ మెసేజ్. ‘జిన్నా’ అంటే కరాచీ లోని మజార్-ఇ-క్వైద్. పాకిస్తాన్ ఫౌండర్, మొహమ్మదాలీ జిన్నా సమాధి అక్కడే ఉంది.

***          ***          ***          ***

**సెప్టెంబర్,15, 2012**

సి.బి.ఐ. అకాడమీ, ఘజియాబాద్

ప్రతి ఏటా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ లోకి రిక్రూట్ అయ్యే ఆఫీసర్స్ కి ఇక్కడే ట్రెనింగ్ యిస్తారు. జూన్ 2011లో రిక్రూట్ అయిన ఆఫీసర్స్ ట్రెనింగ్ పూర్తి కావస్తోంది. మన చట్టం గురించి అవగాహన, ఫోరెన్సిక్ సైన్స్, కమ్యూనికేషన్ ల తో పాటు ఆయుధాల గురించి, అవి లేనపుడు అవసరమైతే ఎలా ఆత్మరక్షణ చేసుకోవాలి, ఇలాంటి విషయాలమీద, అనుభవం ఉన్నవారితో థియరీ, ప్రాక్టీస్ లలో ట్రెనింగ్ ఇవ్వబడుతుంది.

రెగులర్ ఎక్సర్ సైజ్, నియమితమైన ఆహారం అలవాట్లవల్ల, ఆఫీసర్స్ అందరూ చురుగ్గా ఉన్నారు. పాలిటిక్స్ కారణంగా ఎన్ని విమర్శలు వచ్చినా, ఇప్పటికీ సి.బి.ఐ. కి ప్రపంచం లో ఓ ఉత్తమ స్థాయి ఇన్వెస్టిగేషన్ సంస్థ అన్న పేరు నిలబడేందుకు ముఖ్యమైన కారణం - ఈ ట్రైనింగ్.

అకాడమీ డిప్యూటి హెడ్, అరవింద్ నార్లేకర్ కొన్ని కొత్త వెపన్స్, టూల్స్ గురించి ఆఫీసర్స్ కి చెబుతున్నాడు.

“సో... మై డియర్ యంగ్, డిప్యూటి ఎస్.పీస్.(సి.బి.ఐ.లో ట్రైనింగ్ తర్వాత ఆఫీసర్ కి ఇచ్చే మొదటి పొసిషన్ డిప్యూటి ఎస్.పీ.), మన స్పెషల్ అమ్యూనిషన్ డిపార్ట్మెంట్ తయారుచేసిన ఈ బైనాక్యులర్, చూడ్డానికి మామూలు నైట్ విజన్ బైనాక్యులర్ లాగే కనిపిస్తుంది. కానీ, ఈ థర్మోగ్రాఫ్ సెన్సర్ వల్ల ఇది భూతకాలం (పాస్ట్) లోకి కొంతవరకు వెళ్లగలదు.”

ఆఫీసర్స్ ఆశ్చర్యంగా ఆ బైనాక్యులర్ వైపు చూస్తున్నారు.

“సర్... యూ మీన్...ఇది టైం మిషన్ లా పాస్ట్ లోనికి వెళ్లి హిస్టరీ చూపించగలదా !?” ఓ ఆఫీసర్ అడగడంతో అందరూ ఆమె వైపు చూశారు. ఆమె పేరు షాజియా. ఈమధ్య మనదేశంలో అన్ని ఫీల్డ్స్ లోనూ అమ్మాయిల పార్టిసిపేషన్ పెరిగింది, కానీ సి.బి.ఐ.లోమాత్రం యింకా చాలా తక్కువమంది అమ్మాయిలే చేరుతున్నారు.

షాజియా ముంబై యూనివర్సిటీ నుండి జియాలజీలో ఎం.ఫిల్. చేసింది. తర్వాత, రెండేళ్ళకు పైగా డిపార్ట్ మెంట్ ఆఫ్ జియాలజీ లో జూనియర్ సైంటిస్ట్ గా పనిచేస్తుండగా, సి.బి.ఐ.కి సెలక్ట్ అయింది. ఆమె క్లాస్ మేట్స్ అందరూ టీచింగ్, సైంటిఫిక్ ప్రొఫెషన్ లాంటివి సెలక్ట్ చేసుకున్నారు. కానీ చదువుకూ, ప్రొఫెషన్ కూ సంబంధం అవసరం లేదనేది ఆమె నమ్మకం. పైగా ఆమె మంచి జూడో ఫైటర్ కూడా. అందుకే పట్టుబట్టి సి.బి.ఐ.లో చేరింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kapardi**

* * *